# స్పాన్సర్డ్ చప్పట్లు

రాత్రి పదకొండున్నర దాటింది. హాల్లో కూచుని రాజమండ్రి నించి మా సేల్స్ మేనేజర్ అనబడే లక్ష్మీపతి ఫోన్ కోసం ఎదురుచూస్తున్నాను. అన్ని పత్రికలూ , పేపర్లూ చదవడం, అన్ని ఛానల్స్ సినిమాలు చూడ్డం కూడా ఐపోయింది. కొద్దిగా నిద్దరొచ్చే లక్షణాలు కనిపిస్తున్నాయి. ఇంక చేయడేమోలే పోయి పడుకుందాం అనుకుంటుంటే మోగింది.

"ఏమిటింత ఆలస్యం? డిడి తీశారా?"

"క్షమించాలి. మేడం. ఇంత రాత్రి డిస్టర్బ్ చేస్తున్నా. మీరేదో ఫోన్ కోసం ఎదురుచూస్తున్నారనుకుంటా. రెండు రింగుల్లో తీయకపోతే పెట్టేద్దామనుకున్నా!"

"సుధాకర్! ఇంత రాత్రివేళ ఏమిటి విశేషం? నిన్న మీ యూనిట్‌కి ఫోన్ చేస్తే ఢిల్లీ వెళ్ళారన్నారు!"

"అవును. ఇప్పుడే వస్తున్నా. ఫ్లైట్ రెండు గంటలు లేటు. ఎయిర్‌పోర్ట్‌నించే మాట్లాడుతున్నా. అనుకో

కుండా ఎయిర్‌పోర్ట్‌లో మన కేంద్ర రాజ్య పరిశ్రమల మంత్రిగారితో పరిచయం ఐంది. మన ఎస్టేటు గురించి చెప్తే ఆయన చాలా ఇంటరెస్ట్ చూపించారు. రేపూ, ఎల్లుండీ మన సిటీలోనే ఉంటారట. ఎల్లుండి మనం ఉగాది వేడుకలు జరుపుకుంటున్నాం రమ్మని ఆహ్వానిస్తే ఆయన 11-11.30 గంటల మధ్య మన ఎస్టేట్‌కి వస్తానన్నారు. ఇటువంటి అవకాశం మనకి మళ్ళీ మళ్ళీ దొరకదు కదాని మనందరి తరఫునా ఆయన్ని పిలిచేశా. ఆయన చాలా చిన్నాయన. బాగా చదువుకున్నవారు. చాలా ఉత్సాహంగా దేశానికేదో చేయాలనే తపనతో ఉన్నారు. ఎలాగైనా మనందరం కలసి సక్సెస్ చేయాలి. నాకు మీరే గుర్తుకొచ్చారు. టైమెంతో లేదు. ప్లీజ్, మనకున్న సమస్యలుకొన్ని చెప్పవచ్చు వారికి."

"పొద్దున్నే ఎనిమిదికల్లా నేను మా యూనిట్‌కొచ్చేస్తా. అక్కడ కూచుని ఫైనలైజ్ చేద్దాం" - ఫోన్ పెట్టేశాను.

పూర్వంలో ఏవైనా పెళ్ళిళ్ళూ, పేరంటాలూ ఐతే అన్నిట్లోనూ తగుదునమ్మా అని ముందుకొచ్చే ఆడవాళ్ళు కొందరు ఉండేవారుట. ఎక్కడ ఏ సందడి జరిగినా వీళ్ళు అరవచాకిరీ చేసి ఒళ్ళు హూనమై కొంపలకి చేరేవారన్నమాట. అలాంటి అంశ నాలోనూ ఎక్కడో ఉన్నట్టుంది. నన్ను కాస్త తెలిసున్న వారెవరైనా, వాళ్ళింట్లో తోరణం కట్టాల్సి వస్తే ముందు నాకు ఫోన్ చేసేస్తారు. వంటవాడి నంబరూ, బ్రాహ్మడి అడ్రసూ, సన్నాయి వాడూ.... ఇలా మొత్తం. ఉత్త సలహా ఇద్దామని మొదలు పెట్టిన దాన్ని పూర్తిగా ఇన్వాల్వు ఐపోయి అలసి పులుసుకూరై పోతాను. పెళ్ళిళ్ళకే కాకుండా, మీటింగులకీ, సెమినార్లకీ, వర్క్‌షాప్‌లకీ, ఎగ్జిబిషన్లకీ అన్నిటికీ పనికొచ్చే టైపు. ఇంక ఈ ఫంక్షను మావాడలోనే ఐనపుడు నాకు తప్పేదేముంది!

సుధాకర్‌ది మాకు రెండు యూనిట్లకవతల. మాకన్నా 10,15 ఏళ్ళు చిన్నవాడు. ఎవరిదో యూనిట్ సిక్‌అయి అమ్మకానికి వస్తే తను టేకోవర్ చేశాడు. మంచి కలిగిన కుటుంబంలోంచి వచ్చాడు. ప్రపంచం పోకడలు బాగా తెలిసినవాడు. చేతికొచ్చిన ఒక్క అవకాశాన్ని కూడా జారవిడువడు. అలాంటి వాడు దారిలో కనిపించిన మంత్రిగారిని వదులుతాడా. అందరితో స్నేహంగా ఉంటూ స్వామికార్యం, స్వకార్యం కూడా చేసుకు రాగల సమర్థుడు. ప్రస్తుత సంవత్సరంలో మా అసోసియేషన్‌కి సెక్రటరీ.

ఇతను ఫర్వాలేదు కానీ, మా ఎస్టేట్‌లో మా ఫ్రెండ్స్ అందరికీ మాత్రం అన్నిటి మీదా వైరాగ్యం వచ్చేసింది. వాళ్ళు ఏం చెప్పినా వినరు. విన్నా నమ్మరు. చివరికి మన దేశానికి వాజ్‌పాయ్ ప్రధానమంత్రి అంటే కూడా అనుమానంగా చూస్తారు. అంటే అన్ని దెబ్బలు తిన్నారన్నమాట. ఇలాంటి వాళ్ళని పోగేసి ఉగాది వేడుక జరిపించడం అంటే మాటలా. రాకపోతే, చంపుతామనన్నా కూడా పదిమంది కన్నా కూడా

పోగవరు. ఏ ఎంట్రప్రెన్యూయర్స్ ఐతే జీవితంలో అందరికన్నా ఉత్సాహంగా, శక్తివంతంగా, ఆశావహంగా ఉండాలని భావిస్తామో, అటువంటివాళ్ళే నిరుత్సాహంగా, నిస్తేజంగా అయోమయంగా తిరుగాడే ఈవాడలో దేశం అంతా సుభిక్షంగా ఉంది, మాకు బోల్డు ఆర్డర్లున్నాయి. మేం అడక్కుండానే బ్యాంకులవాళ్ళు డబ్బిచ్చేస్తున్నారు. కస్టమర్స్ సరుకివ్వంగానే పేమెంట్సు ఇచ్చేస్తున్నారు. మాకేం బాధలు లేవు. మా దగ్గరికెవ్వరూ ఇన్స్పెక్టర్లు రారు. మా కరెంటు ఫ్యూజులు పీకెయ్యరు. మమ్మల్ని ఎవ్వరూ ఏ ఫేవర్లూ అడగరు - అనే లాంటి మయసభ సృష్టించడం మాటలు కాదు. మా యూనిట్లెంత డల్‌గా ఉన్నాయో చెప్పాలంటే, మామూలురోజుల్లో మా వాడలోని రాజవీధి కన్నా ఆదివారం నాడు మా ఇంటి వీధి ఎక్కువ సందడిగా ఉంటుంది.

ఐనా నేనూ, సుధాకరూ తెగించి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ప్రయత్నాలు చేశాం. మా అసోసియేషన్ ఎకౌంట్‌లో 800 ఉన్నాయి. 100 మెంబర్లలో 38మంది మాత్రమే ఏడాది చందా 100 రూపాయలు కట్టారు. కనీసం 10వేలన్నా లేకపోతే ఫంక్షనెలా ఔతుంది. పోనీ, మావాళ్ళ దగ్గర వసూలు చేద్దామంటే మొదటికే మోసం వస్తుంది. ఇలాటి విషయాల్లో నా బుర్ర పాదరసంలా పనిచేస్తుంది. ఏమాట కామాట చెప్పుకోవాలి మరి. మా ఎస్టేట్‌లో అందరి పరిస్థితీ అంత అధ్వాన్నంగా లేదు. వంద యూనిట్లలో ఒక పదిహేను, ఇరవై మంది దాకా 50-60 పనివాళ్ళనీ, నాలుగైదు కార్లనీ మెయింటైన్ చేయగల స్థోమతతో ఉన్నారు. వందల కోట్ల మీద టర్నోవరు చేసే యూనిట్లు నాలుగైదున్నాయి. వాళ్ళు నిజంగానే గ్లోబల్ మార్కెట్‌లో పోటీ చేస్తూ మా పరువు నిలబెట్టున్నారు.

కేంద్ర మంత్రిగారి చేతులమీద వారికి సన్మానం ఏర్పాటు చేస్తామని వాళ్ళ పి.ఆర్.ఓ.లకి చెప్పాం. ఎంత గట్టి పి.ఆర్.ఓ.లు లేకపోతే అంత ఎంపైర్స్ నిర్మించగలిగారు మరి. మేం నలుగురికీ ఫోన్ చేసి విషయం చెప్పి పావు గంటలో కన్ఫర్మ్ చేసుకున్నాం. నలుగురిలో ఇద్దరు రావటం కుదరదు వేరే ఎపాయింట్‌మెంట్స్ ఉన్నాయని చెప్పి చెరో వేయి రూపాయలకి చెక్కులు పంపించారు, విత్ ఆల్ గుడ్ విషెస్. ఇంకొకాయన పి.ఆర్.ఓ. చెప్పారు - వాళ్ళ ఎం.డి. ఏ సన్మానానికీ అంగీకరించరు కాబట్టి క్షమించండన్నారు. ఇంక పై అందరిలోకీ పెద్దఎంట్రప్రెన్యూయర్ బోసు బాబుగారున్నారు. ఆయన కాల్ కూడా తేలిపోతే, అప్పుడు మిగతా ప్రయత్నాలు చేద్దామనుకున్నాం.

తొమ్మిదిన్నర కల్లా బోసుబాబుగారే స్వయంగా ఫోన్ చేశారు.

"సుశీలగారూ! కులాసానా? డాక్టరుగారెలా ఉన్నారూ?"

"అంతా బావున్నాం. చౌదరిగారు విషయం చెప్పారా?"

"దానికే వస్తున్నా. ఏం లేదు. మా ఫ్యాక్టరీ విస్తరణ కోసం పటంచెరువులో 25 ఎకరాలు తీసుకున్నాం కదా. నిరుడు భూమి పూజకి కూడా వచ్చారు మీరు. ఎలాగూ పెద్దవాళ్ళు మన ఎస్టేట్‌కి వస్తున్నారు కదా! చతుర్వేదిగారి చేతుల మీదుగా మా కొత్త యూనిట్ ఆవిష్కరణ చేయిస్తే ఎలా ఉంటుందని ఐడియా వచ్చింది మీరేమంటారు?"

"దానికేం! బానే ఉంటుంది. కానీ పటంచెరువు వెళ్ళి రావాలంటే చాలా టైం పట్టదూ. అంత త్వరగా మెషినరీ ఎరెక్టయిపోయిందా?"

"అబ్బే. అంతదాకా వెళ్ళక్కరలేదు. మా దగ్గర మొత్తం యూనిట్ మాడ్యూల్ ఉంది. అది స్టేజీ దగ్గరగా పెట్టుంచుతాం. ఆయన జ్యోతి వెలిగిస్తే చాలు. సమయాభావం వల్ల అలా చేయవచ్చు. తప్పులేదు. మీరుగానీ సరే అంటే, మేం గంటలో ఇన్విటేషన్స్ వేయించి అందరికీ డిస్ట్రిబ్యూట్ చేస్తాం. మీరు కూడా ఎసోసియేషన్ తరఫున కార్డ్స్ సైక్లోస్టైల్ చేయించిస్తే మా కుర్రాళ్ళు ఇచ్చేస్తారు. ఇక మొమెంటోలూ, మిగతా అరేంజిమెంట్స్ చౌదరిగారికి అప్పజెప్పుతాను. మాకు ఆ రోజు 10 నిమిషాలకన్నా అక్కరలేదు. మీరూ, సుధాకర్‌గారూ మన ఫ్రెండ్సందరినీ పిలవండి. నేను రెండు మూడు బ్యాంకుల సి.జి.ఎం.లతో మాట్లాడి ఆ ఏర్పాట్ల మీద ఉంటాను. ప్రోగ్రామయ్యాక లంచ్ పెట్టుకుందాం. మీ ఇన్విటేషన్‌లో లంచ్ 12.30 కని రాయండి."

"సరే! అలాగే కానిద్దాం".

ఇంక నాకూ, సుధాకర్‌కూ పట్టపగ్గాలు లేవు. పరమానందభరితులమైపోయాం. అదృష్టమంటే అలా ఉండాలి. ఓ షామియానా ఖర్చు లేదు. ఫోటోల ఖర్చు లేదు. టీ ఖర్చైనా లేదు. పైపెచ్చు ఇంత గ్రాండ్‌గా ఉగాది సెలబ్రేట్ చేశామన్న పేరు వస్తుంది. ఐదు నిమిషాలయ్యాక చౌదరిగారు ఫోన్ చేసి మా ప్రెసిడెంట్ గారి పేరూ, ఆఫీస్ బేరర్ల పేరూ తెలుసుకున్నారు. ఇంకో గంటకల్లా మేం ఓ వంద కాపీలు ఇన్విటేషన్స్ వేయించి ముప్ఫయ్యో, నలభయ్యో చౌదరిగారికిచ్చాం. మిగిలినవి మా ఫ్రెండ్స్‌కిచ్చి బతిమాలీ, బామాలీ రమ్మని ఒప్పించేసరికి సాయంత్రం అయ్యింది. ఐనా మాకు పెద్ద పనులేమున్నాయి. అన్నీ చౌదరిగారికి అప్ప జెప్పేశాంగా. లోకల్ బ్యాంకు మేనేజర్లకి వాళ్ళ తండ్రులకీ, తాతలకీ కూడా ఆహ్వానాలందించి సగం మందిచేత తప్పక వస్తామనిపించుకుని వచ్చేశాం. ఇంకోసారి చతుర్వేదిగారి పి.ఏ.తో మాట్లాడి ఆయన ప్రోగ్రాం కన్ఫర్మ్ చేసుకున్నాం.

అన్నీ బాగున్నాయి కానీ, ఇంతవరకూ మా ఎసోసియేషన్ ప్రెసిడెంట్ దగ్గరకెళ్ళనే లేదు. ఆయన మా అందరికన్నా సీనియర్. మా ఎస్టేట్‌లో మొట్టమొదట యూనిట్ పెట్టినాయన. చాలా చాలా పెద్దమనిషి. మేం

ఐ.ఐ.ఎస్.సి.లో ఉన్నప్పుడే అక్కడ మాకన్నా చాలా సీనియర్ సైంటిస్ట్‌గా ఉండేవారు. ఆయనతో ఎప్పుడూ తక్కువ మాట్లాడాలి. అందుకని ముందు ఫోన్ చేసి వీలుకనుక్కుని వెళ్ళి జాగ్రత్తగా విషయం చెప్పాం. ఆయనని మన సాధక బాధకాలగూర్చి మాట్లాడమని అడిగాం. చివరగా ఇలా బోసుబాబుగారు వాళ్ళ కొత్త యూనిట్‌కి జ్యోతి వెలిగించే కార్యక్రమం కూడా కేంద్ర మంత్రిగారిచేతే చేయిస్తానన్నారనీ, మొత్తం ఖర్చులన్నీ చూసుకుంటామన్నారనీ చెప్పాం.

ఒక రెండు నిమిషాలేం ఆయన మాట్లాడలేదు. నెమ్మదిగా అన్నారు" అందరం తలా ఓ వెయ్యి వేసుకుంటే సరిపోయేదిగా. వారినొక్కరినీ ఎందుకు ఇబ్బంది పెట్టడం?" ఒకళ్ళ మొఖాలొకరు చూసుకుని మాట్లాడకుండా వచ్చేశాం తేలు కుట్టిన దొంగల్లా. నిజమేగా, వెయ్యి రూపాయలు ఇవ్వలేని పరిస్థితుల్లో లేంగా మరి!

నేను పొద్దున్నే పులిహోర, పాయసం చేసి బల్ల మీద పెట్టేయడంతో మా ఇంట్లోకి ప్రమాది ప్రవేశించింది. ఏ పండక్కైనా అదే మా స్టాండర్డ్ సెలెబ్రేషన్. మా ఆయన పుణ్యమా అని మా ఇంట్లో తెల్లారేసరికి ఆరు పేపర్లు వాల్తాయి. ఊరికే పేజీలు తిప్పుతూంటే ఒక పేపరు ఆఖరి పేజీ సగానికి పెద్ద ఎడ్వర్టైజ్‌మెంట్ కనబడింది. పైన రాష్ట్రముఖ్యమంత్రిగారి ఫోటో , పక్కన కేంద్రమంత్రిగారి ఫోటో, కింద ఎడం చేతి పక్కన రాష్ట్ర పరిశ్రమలమంత్రిగారి ఫోటో, కుడిపక్క బోసుబాబుగారిదీ, మధ్యలో వారి యూనిట్‌దీ ఫోటోలు. పదకొండున్నరకు కేంద్రమంత్రి స్వహస్తాలతో జ్యోతి ప్రజ్వలనం అనీ, రాష్ట్ర ప్రగతిలో తమ వంతు పాత్ర నిర్వహిస్తున్న సురేఖావారి సంస్థ నూతన ప్రాజెక్ట్ - రాష్ట్రానికిచ్చే ఉగాది కానుక అనీ, వగైరా వగైరా తీరులో పదజాలాలు. పొద్దున్నే తీపి తినేప్పటికి కడుపులో తిప్పినట్లైంది. నా జీవితంలో అదే మొదటిసారేమో. కూచున్నచోటనించి కదలకుండా ఆరు పేపర్లూ తిప్పడం. ఐదింటిలో అదే కథ. ఇంతలోకీ ఫోన్ మోగింది.

"పేపరు చూశారా? మన ప్రోగ్రాం వీళ్ళిలా టేకోవర్ చేశారేమిటీ? గురువుగారికెలా చెప్పడం?"

"టేకోవరేమిటీ? మెర్జరనండి. సుధాకర్! మనం వెళ్ళి నిష్పూచీగా ఫంక్షన్ ఎంజాయ్ చేద్దాం. ఇందులో మనకి పోయిందేముంది? ఎలాగూ, గురువుగారు అడగాల్సినవి అడుగుతారు. హుందాగా మనం ఇలా చేయాలనే భావించినట్లు ప్రవర్తిద్దాం. వేరేగా అనుకుంటే మనకే బాధ."

ఒక్క రాత్రిలో మా ఎస్టేట్ రూపు రేఖలే మారిపోయాయి. చౌరస్తా నుంచి మా ఎస్టేట్‌దాకా మంత్రివర్యులందరిని సురేఖా వారి బ్యానర్లు ఆహ్వానిస్తున్నాయి. పాపం, మా అసోసియేషన్ బ్యానరు పేద ముత్తైదువులా ఓ పక్కన వేలాడుతోంది. కొత్తది రాయించమంటే వినిపించుకోడు సుధాకర్. స్టేజీ మీద చక్కటి టేబిల్స్,

కుర్చీలు, పూల కూజాలు, మినరల్ వాటర్ సీసాలు - మాంచి క్లాసుగా ఉంది. స్టేజీ మీద బల్లకి కుడి పక్కగా కొంచెం అవతల చిన్న టేబిల్ మీద సురేఖా వాళ్ళ కొత్త యూనిట్ మాడ్యుల్ లైట్లతో మెరిసిపోతోంది. ఎదురుగా పెద్ద వెండి దీపం నిలబెట్టి ఉంది. అంతా మామిడి తోరణాలు. మాకైతే, పరాయి వాళ్ళ ఫంక్షనికెళ్ళినట్టుంది. చౌదరిగారు రాత్రంతా అక్కడే ఉన్నాట్ట.

పావుగంటలో వచ్చేస్తారని వాళ్ళ యూనిట్‌లో పనిచేసే అమ్మాయిలు చెప్పారు. అందరూ పచ్చ రంగు పట్టుచీరలు కట్టుకుని, వడ్డాణాలూ, జడకుప్పెలూ పెట్టుకుని, ఉగాది లక్ష్మల్లా మెరిసిపోతున్నారు. పోనీలే! ఎవరిందులో లాభపడితేనేం! ఇన్నాళ్టికి మన ఎస్టేట్‌లో కూడా ఒక తోరణం కట్టారు కదా! ఎప్పుడూ లాకౌట్లూ, దిగుళ్ళూ, నోటీసులూ, అప్పులాళ్ళూ, వేలాలూ ఐన జీవితంలో ఇది నిజంగా పరవడిగా తోచింది.

మొదట్లో ఆయన అలా చేశారు చూశారా అనిపించినా, పోన్లే మనవాడే కదా అని సర్దుకుపోయి ఆ వేడుకలో కలిసిపోయాం. ఈగో ఒకటి పక్కన పెట్టేస్తే అంతా పచ్చగా ఉంటుందిగా మరి!

కాసేపటికల్లా, చౌదరిగారు మంచి బ్రౌన్ కలర్ సూట్‌లో దిగారు. "ఎలా ఉన్నాయి మేడం మన ఏర్పాట్లు? నేను రాత్రంతా ఇక్కడే. సార్ వెళ్ళారు రవీంద్రభారతికి. చతుర్వేదిగారు కూడా అక్కడనుంచే వస్తారట. నిన్న సాయంత్రం మేం ఇద్దరం వెళ్ళి మా తరఫున కూడా ఆహ్వానించి వచ్చాం. చాలా బాగా మాట్లాడారు. వారిని తీసుకొచ్చేందుకు మీరు వెళ్ళక్కరలేదు. సార్, వాళ్ళబ్బాయీ తీసుకొచ్చేస్తారు."

అమ్మయ్య!, ఇంక మనకాపని కూడా మిగల్చలేదనుకుని, నేనూ, సుధాకరూ మూడో వరసలో మా ఫ్రెండ్స్‌తో కూచుని బాతాఖానీ మొదలుపెట్టాం. వాళ్ళందరూ నన్నాటపట్టించడం మొదలుపెట్టారు.

"ఏమిటి డాక్టరుగారూ, ఏదో పెద్ద ఫారిన్ కొలాబరేషన్‌కి ట్రై చేస్తున్నారటగా!" - సుధాకరంటున్నాడు. "అందుకే ఢిల్లీనించి మంత్రిగారిని పిలిపించారట" - ఏమన్నా పట్టించుకోనని వాళ్ళకి చాలా నమ్మకం.

"మన హయాంలో ఎంత మంది మంత్రుల్నిచూడలేదు గనక. ఈజన్మకీ అదృష్టం చాల్లేండి. యీ యూనిట్టీమాత్రంగా నడిస్తే జన్మ ధన్యమైందనుకుంటాను. నేనూ మీలాగే ఏదో వేడుక చూద్దామని వచ్చిన దాన్నే!"

పావు తక్కువ పదకొండయేసరికి షామియానాలు నిండసాగాయి. వచ్చిన వాళ్ళకి వచ్చినట్లుగానే రస్నాలిస్తున్నారు ఉగాది లక్ష్మలు. మావాడ పరిసరాల్లో మాకోసం నియోగించిన బ్యాంకు మేనేజర్లంతా వాళ్ళ స్టాఫ్‌తో సహా వచ్చి వాళ్ళ పెద్దలకోసం ఎదురుచూడసాగారు. అన్ని బ్యాంకుల బ్యానర్లూ ఎక్కడో అక్కడ తగిలించేశారు. ఇంతలోకీ మా ఎసోసియేషన్ ప్రెసిడెంట్‌గారొచ్చారు చడీచప్పుడు లేకుండా.

"ఏం సుధాకర్! నేను స్వాగతోపన్యాసం చెప్పాలా? ఓట్ ఆఫ్ థాంక్స్ చెప్పాలా" ఇంతకీ ఆ వచ్చే వాళ్ళ పేర్లూ డిజిగ్నేషన్లూ రాసివ్వు" అన్నారు. వెంటనే అన్నీ ఉన్న కాగితం ఆయనకిచ్చి అతను చెప్పాడు- "మీరు అన్నీ వివరంగా మాట్లాడండి. నేను ఓట్ ఆఫ్ థాంక్స్ చెప్తాను."

సర్లెమ్మని అక్కడే కూచుని మాతో పిచ్చాపాటీ మొదలెట్టారు. రాజులు పోయినా రాజవీధులున్నాయి. రాచరికాలున్నాయి.సంప్రదాయాలున్నాయి. అంతస్థులున్నాయి. పద్ధతులున్నాయి. అన్నీ అలాగే వున్నాయి సుమా అన్నట్లుగా పోలీసులూ, పైలట్ కార్లూ ముందు రాగా వరుసగా ఐదారు కార్లొచ్చి ఆగాయి. హడావిడిగా డ్రైవర్లు దిగి కారు తలుపు తీయగా ఒక్కొక్కళ్ళే దిగి వేదిక వైపు రాసాగారు. భోన భోంతరాళాలు దద్దరిల్లేట్లు సన్నాయివాళ్లు వాయిద్యం మొదలుపెట్టారు. తాగే రస్నాలు పక్కన పడేసి వేదపండితులు ఏదో ఘోష మొదలుపెట్టారు. దాన్నే మంటారో నాకు తెలియదు మరి. ఇంతట్లోకీ మా సిటీలో ఏ ప్రోగ్రామైనా పౌరోహిత్యం చేసే వకుళాదేవి కంఠం వినిపించసాగింది.

"స్వాగతం! సుస్వాగతం! నూతన సంవత్సరాన్ని మా ఆవరణలోకి తెచ్చిన మన కేంద్ర మంత్రి చతుర్వేది గారికీ, మన రాష్ట్రాన్ని దేశానికే తలమానికంగా చేసే ప్రయత్నంలో అలుపు సొలుపెరగకుండా అహ రహమూ శ్రమించే మన ప్రియతమ రాష్ట్ర ముఖ్యమంత్రిగారి కుడి భుజమైన మన పరిశ్రమల మంత్రి గారికీ ఇక్కడ మీకోసం వేచియున్న సభికులంతా స్వాగతం పలుకుతున్నారు. ఈ రోజు మాకందరికీ సుదినం. ఒక కొత్త ఉగాది. మాననీయ మంత్రి వర్యులందరూ వచ్చి ఒక పారిశ్రామికవాడలో ఉగాది వేడుకలు జరుపు కోవడమే వారి అకుంఠిత దీక్షకీ కర్తవ్య పరాయణత్వానికీ నిదర్శనం. ఖండఖండాంతరాల వాణిజ్య వీధులలో భారతదేశపు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తున్న సురేఖా లిమిటెడ్‌వారి నూతన ప్రాజెక్టుకి నాంది పలికి మనందర్నీ పలకరించడానికి విచ్చేసిన పెద్దలకీ మా ధన్యవాదాలు."

ఇలా చెప్పిన మాట చెప్పకుండా, పొగిడిన పొగడ్త పొగడకుండా మాలాంటి నిరక్షరకుక్షులకి అర్థంకాని భాషలో ఆవిడ ఆహ్వానాలు అనర్గళంగా సాగిపోతూనే ఉన్నాయి. అందరూ వీనులవిందుగా వింటున్నారు. మరి పూర్వమయితే ఏకంగా వంధిమాగధులకి ఒక విభాగమే ఉండేదిగా, రాజులకి రోజూ ధైర్యం నూరి పోసేందుకు! ఇంతలోకే వేదికమీద కుర్చీలు నాలుగు కాస్తా పన్నెండయ్యాయి. బోసుబాబుగారు రాష్ట్ర, కేంద్ర మంత్రులమధ్య శ్రీదేవి, భూదేవిల మధ్య విష్ణుమూర్తిలా విరాజిల్లుతున్నారు.

ఎందుకైనా మంచిదనుకున్నారేమో. మా ప్రెసిడెంటుగారినీ, నన్నూ, సుధాకర్‌నీ పిలిచి పరిచయం కూడా చేశారు. చతుర్వేదిగారు నవ్వుతూ, సుధాకర్‌ని "మిమ్మల్ని ఎయిర్‌పోర్ట్‌లో కలిశాను కదా" అని పలకరించారు. ఆ భాగ్యానికే మేం తబ్బిబ్బైపోయి మళ్ళీ వెళ్ళి మా ఫ్రెండ్స్‌తో కూర్చున్నాం. రెండు సార్లు

పిలిచాక మా ప్రెసిడెంటుగారు స్టేజి ఎక్కి రెండో వరసలో కూర్చున్నారు.

ఇంక వకుళమ్మతల్లి మైకు పట్టుకుని సురేఖావారి జీవిత చరిత్రంతా చదివి మంత్రిగారిని జ్యోతి ప్రజ్వలించ మని ప్రార్థించింది. బోసుబాబుగారిని మంత్రివర్యులకీ మిగతా పెద్దలకీ ఫ్లోరల్ ట్రిబ్యూట్స్ ఇమ్మని ప్రార్థించింది. ఆ తరువాత అందరికీ పేరు పేరునా మెమెంటోలిమ్మని ప్రార్థించింది. ఇలా ప్రార్థించగా ప్రార్థించగా, అర్థించగా, అర్థించగా వారి కొత్త ఫ్యాక్టరీ ఉద్ఘాటనా కార్యక్రమం పూర్తి అయింది. ఇంక ఉపన్యాసాల పర్వం మొదలయ్యింది.

బోసుబాబుగారు పాపం పెద్ద వక్తకాదు. రాసుకొచ్చింది చదివేశారు. వాళ్ళ ఉత్పత్తులు ప్రస్తుతం ఏఏదేశాల్లో విరివిగా అమ్మకం అవుతున్నాయో ఇంకా ఎంత చేయదల్చుకున్నారో అన్నీ చెప్పారు. ఆ తర్వాత రెండు మూడు బ్యాంకులపెద్దసార్ వాళ్ళు, వాళ్ళ సెక్రట్రీలు రాసిచ్చిన ఉపన్యాసాలు చదివారు. దేశపురోభివృద్ధికి ఎన్నెన్ని రుణాలు మంజూరు చేస్తున్నారో, ఎన్నెన్ని పరిశ్రమలు వారి కృషివల్ల వెలుగులోకి వస్తున్నాయో గణాంకాలు చెప్పారు. విజయవంతమైనవన్నీ వాళ్ళ ప్రతిభవల్ల ఐనట్లు లెక్కలు చెప్పుకుని, కానివాటి బాధ్యతని యాజమాన్యలోపం, నిధుల దుర్వినియోగం వంటి వాటికి వదిలేశారు. ఐనప్పటికీ అటువంటి నష్టాలు భరిస్తూ దేశం కోసం సేవలిస్తున్నామన్నారు. అటు ఇటుగా వాళ్ళు చెప్పేది ఒకటే. ఈ సేవ అనే మాట వినీ వినీ ఎంత విసుగొచ్చేసిందో? మన బతుకుతెరువు కోసమో, మరోటి కోసమో, మన పనులు మనం చేసుకుంటున్నపుడు ఈ సేవల గోలేమిటి? డబ్బివ్వందే మందులివ్వని వైద్యులు మానవ సేవ గురించీ, లక్షలుచ్చుకుని నటించే నటులు కళాసేవ గురించీ, కాన్వెంట్లు పెట్టి రూపాయలు దండుకునే వాళ్ళు విద్యాసేవ గురించీ అధికారాన్నాశించి రాజకీయాల్లో పనిచేసే ప్రముఖులు దేశసేవ గురించీ మాట్లాడితే వినడానికి విడ్డూరంగా ఉండదూ! అది మా వృత్తి ధర్మం, ఉద్యోగధర్మమనీ ఒప్పు కోరేం? ఇంకా దేవుడే నయం. డబ్బుచ్చుకుని పొందే పూజలన్నిటికీ ఆర్జితసేవలు సుమా అని ఒప్పు కుంటాడు. నిజాయితీగా! ఐనా అంత పెద్ద బ్యాంకాఫీసర్లు మాకు సేవలు చేస్తున్నారని తెలుసుకుని పులకించిపోయాం.

ఇలా అందరూ మాట్లాడింది వింటుండగా రాష్ట్రమంత్రిగారి వంతు వచ్చింది. కాలం మారింది కాబట్టి అన్నీ ప్రభుత్వాలు చేయాలని ఎదురుచూడకుండా పారిశ్రామికవేత్తలే విదేశాల్లో పర్యటించి రాష్ట్ర పురోభివృద్ధికి తోడ్పడాలన్నారు. బీదాబిక్కీ సన్నకారు, చిన్నకారు పరిశ్రమలకూ, మహిళలకూ అనేక పథకాలు తెస్తున్నా మనీ, మహిళలకు ఎన్నో రాయితీలతో ప్రత్యేకంగా పథకాలు తెస్తున్నామనీ చెప్పారు. యువకులకు లక్ష రూపాయల పెట్టుబడిలోపు పరిశ్రమలు నడిపేందుకు రుణ సహాయమందిస్తున్నామని

తెలిపారు.

ఐనా ఒక్కసారి అబిడ్స్‌కి బస్సులో వెళ్ళి వస్తే 15 రూపాయలూ, ఆటోలో వెళ్ళి వస్తే 100 రూపాయలూ అయ్యే ఈ రోజుల్లో లక్షరూపాయల పెట్టుబడితో చేసే దాన్ని పరిశ్రమంటారా, శ్రమంటారా? లక్ష రూపాయలతో పరిశ్రమ నడిపి వస్తువు తయారు చేసి అమ్మి డబ్బులు వసూలు చేసి, వడ్డీలు కట్టి తాను బతికి కుటుంబాన్ని బతికించుకుని ఇంకో నలుగురికి ఉపాధి కలిగించమనడం జోక్ కాకపోతే మరేమిటి?

చివరగా ఆయన సురేఖా వారి కృషిని అభినందించి, వారికి రాష్ట్ర ప్రభుత్వ సహకారం ఎల్లవేళలా ఉంటుందని అభయహస్తమిచ్చి మైకు కేంద్ర మంత్రిగారికిచ్చారు. ఇంక కాసెట్ బి సైడు వినిపించింది.

దేశ ప్రగతి అంతా చిన్న పరిశ్రమ మీదే ఆధారపడి ఉందనీ, వారే దేశ ఆర్థిక ప్రగతికి వెన్నెముకలనీ, నిరుద్యోగ సమస్యని తీర్చ గలిగింది చిన్న పరిశ్రమలేననీ, కాబట్టి ఇంకా ధైర్యంగా ముందుకువచ్చి పరిశ్రమలు కొత్తవి పెట్టాలనీ, కొత్తకొత్త టెక్నాలజీలను ఉపయోగించుకోవాలనీ(అంటే కంప్యూటరని వారి ఉద్దేశ్యం అయి ఉంటుంది), ఎప్పుడూనాణ్యత విషయంలో రాజీపడి దేశానికి అప్రతిష్ఠ తేకూడదనీ వగైరా.. వగైరా.... ఇవన్నీ వింటూంటే పావుశేరు బియ్యం నానబెట్టి అరిసెలొండి, అడిగినవారికి లేదనకుండా పెట్టి, తను ఊరినుంచి తిరిగి వచ్చేప్పటికి నాలుగు రుచికి సెట్టమని కొత్త కోడలికి ఆర్డరేసే ఆరిందా అత్తగారు గుర్తుకి వచ్చింది నాకు.

మాలో మేం మాట్లాడుకుంటూ అన్నిఉపన్యాసాలూ వింటూ కడుపుమండి కామెంట్లు చేసుకున్నా మా గురువుగారు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు పక్కనే కూచుని ఉన్నారు. స్టేజీ ఎపుడు దిగి వచ్చారో మేం గమనించనే లేదు. వకుళాదేవిగారు ఆయన పేరు సూచించగానే, వెంటనే వెళ్ళి మళ్ళీ స్టేజీమీద కూర్చున్నారు. అందరికీ మొమెంటోలు ఇవ్వడం ఐపోయాక మా ఎస్టేట్ తరఫున మా ప్రెసిడెంట్‌గారిని రెండు ముక్కలు మాట్లాడమని మళ్ళీ వకుళాదేవి అభ్యర్థించింది. ఆయన చాలా క్లుప్తంగా, సూటిగా చెప్పాలనుకున్నవన్నీ చెప్పేశారు.

"గౌరవనీయులైన మంత్రివర్యులకూ, అతిథులకూ , మా మిత్రులకూ ఉగాది శుభాకాంక్షలు. సురేఖా లిమిటెడ్ బోసుబాబు గారికి అభినందనలు. ఇంతమంది పరిపాలకులు విచ్చేసి వారి ప్రణాళికలనూ, ప్రోత్సాహక కార్యక్రమాలనూ తెలిపారు. బ్యాంకులు వారందిస్తున్న సేవలు వివరించారు. కానీ, ఈ సమయంలో నాకు తోచినవీ ప్రస్తుతం ఒక ఎంట్రప్రెన్యూర్‌కి కావలసినవీ చెప్పడం నా విద్యుక్తధర్మంగా భావిస్తున్నాను. ఎటువంటి ప్రకటనలూ, ఆర్భాటాలూ లేకుండానే సుమారు పాతిక సంవత్సరాల క్రితం ఎంతో ముందు చూపుతో ఇటువంటి పారిశ్రామిక వాడ సకల సదుపాయాలతో నిర్మించి మాకు నామమాత్రపు

ధరకి సులభ వాయిదాలలో కట్టే వీలుగా ఇచ్చారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం వారి ఆదేశాల మేరకు సాంకేతిక నిపుణులకు ఏ తనఖాలూ,హామీలూ లేకుండానే తక్కువ వడ్డీరేట్లతో మార్జిను మనీ కూడా అడగకుండా బ్యాంకులు 5 లక్షల వరకూ రుణాలిచ్చారు. అందులో కొన్ని దెబ్బ తిన్న మాట నిజమే. కానీ, బాగా నడిచి ఖండాంతరాలలో కూడా సఫలమైన వారి సంఖ్యేమీ తక్కువ కాదు. (చప్పట్లు). దానికీ సురేఖావారే ఉదాహరణ(చప్పట్లు). కాబట్టి నే కోరేదేమంటే, మళ్ళీ అటువంటి వాతావరణం సృష్టించండి. గట్టినేలలో జాతి మొక్కలు పెరగవు. విద్యావంతులనూ, సాంకేతిక నిపుణులనూ వృత్తి నిపుణులనూ గుర్తించి గౌరవించండి. వారి సేవలని దేశానికి ఉపయోగించుకోండి. మనకున్నవి మానవ వనరులు. అందునా పదిమందికి ఉపయోగపడే మనుషులను గుర్తించడం చాలా అవసరం. అటువంటివారికి పని చేసుకోగల వసతులూ, విద్యుత్తూ, నీరూ ఇత్యాదులు కల్పించడం మన ప్రభుత్వాల విద్యుక్తధర్మం. బ్యాంకులు కూడా గాడిదనూ, గుర్రాన్నీ ఒకే రాటకు కట్టేయకుండా కొలేటరల్ ఉంది కదా అని ప్రజాధనం దుర్వినియోగం చేయకుండా ప్రాజెక్ట్ బలం మీద, వ్యవస్థాపకుని నిజాయితీ, శక్తి సామర్ధ్యాలమీదా ఆధారపడి రుణాలు మంజూరు చేయమని కోరుతున్నాను. కర్ణుడి చావుకి కారణాలారు అన్నట్లు, ఒక ప్రాజెక్టు విజయవంతం కాకపోవడానికి అనేక కారణాలుండవచ్చు. అవి ఎటువంటివో సమగ్రంగా విచారణ చేయకుండా అన్ని కష్టనష్టాలకూ వ్యవస్థాపకుడే బాధ్యత వహించవలసి వస్తూండటంతో చాలా మంది ఔత్సాహికులు వెనుకంజ వేస్తున్నారు. ఇవన్నీ సరిచేయగలమనే హామీ మేము మన ప్రభుత్వాల దగ్గరనించీ కోరుతున్నాం. సెలవు."

ఆయన మాట్లాడింది ఎవరేనా విన్నారో లేక వినినట్లు నటించారో గానీ వేదిక మీద పెద్దలు వాళ్ళలో వాళ్ళు ఇంకేదో మాట్లాడుకుంటున్నట్లు చేయడం మొదలెట్టారు. మేం మాత్రం మా గురువుగారు మా మనసులోని మాట నిక్కచ్చిగా చెప్పేశారని పొంగిపోయాం. సుధాకరు వోట్ ఆఫ్ థాంక్స్ చెప్పడానికని లేచి చొక్కా దులుపుకుని వేదిక వేపుకి వెళ్ళసాగాడు. ఇంతలోకే వకుళ గొంతు మళ్ళీ ఖంగుమంది. వందన సమర్పణ చేయమని సురేఖా లిమిటెడ్ వారి ఫైనాన్స్ డైరెక్టర్‌ను కోరుతున్నాను. చౌదరిగారు సూట్లో సర్దుకుని వేదిక ఎక్కి ఒక్కో దేవుడినీ ఆవాహన చేస్తూ జోలపాట ఉందే- అలాంటిది పాడాడు.. ఆయన మాట్లాడుతుండగానే మా వాళ్ళు లేచేసి భోజనాలవేపు వెళ్ళిపోసాగారు. మా గురువుగారు సుధాకర్ వీపు తడుతూ చెబుతున్నారు.

"మేడమ్ గారూ, నేనూ అంటే పెద్ద నేర్చుకోలేంగానీ, నీలాటి వాళ్ళకింకా టైముందయ్యా. కోట్లు ఊరికే వస్తాయా? అందిస్తే అల్లుకుపోవాలి. మనకి చవగ్గా ఎంత అనుభవమో చూడు!"